క్లుప్తంగా

విద్యార్థుల ఆసక్తిని ప్రోత్సహించాలి



ఫ్రెషర్స్ డే వేడుకలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

మీర్‌పేట: విద్యార్థుల్లోని సృజనాత్మకతను గుర్తించి ఇష్టం ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమమకొండ విఠల్‌రెడ్డి తల్లిదండ్రులకు సూచించారు. శనివారం మీర్‌పేట నాగార్జున మాంటిస్సోరి, ఐఐటీ ఒలింపియాడ్ స్కూల్ ఫ్రెషర్స్‌డే వేడుక సందడిగా జరిగింది. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా చేరిన విద్యార్థులు ఇతర విద్యార్థులతో కలిసిపోయి కొత్త వాతావరణానికి అలవాటు పడేందుకు ఈ వేడుక ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్, ఇంచార్జిలు దుర్గ, రాధిక, సంధ్య ప్రశాంతి పాల్గొన్నారు.

సమ్మె కరపత్రాల ఆవిష్కరణ



బాలాపూర్ చౌరస్తాలో సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాబు

మీర్‌పేట: సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులంతా విజయవంతం చేయాలని ఆ సంఘం బాలాపూర్ మండల అధ్యక్షుడు దాసరి బాబు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం మీర్‌పేట్‌లో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కార్మికులకు వ్యతిరేకంగా, పెట్టుబడి దారులకు ప్రయోజనంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు లక్ష్మి, వెంకటమ్మ, శ్యామల, అశోక్, నర్సింహ, అంజయ్య, కిష్టప్ప, నర్సింహ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి




కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు, సబితాఇంద్రారెడ్డి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు టి.మనోజ్ కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం బీజేపీ నాయకుల బృందం మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలనీలో రహదారులు లేకపోవడంతో స్థానిక ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారన్నారు. ప్రస్తుతం బోనాలు కూడా సమీపిస్తుండడంతో భక్తులంతా పెద్ద ఎత్తున ముత్యాలమ్మ ఆలయానికి తరలి వస్తారన్నారు. సమస్య తీవ్రతను గుర్తించి, రహదారులు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ హరికృష్ణ, వీరబత్తిని రాజేందర్, వడ్ల ప్రభాకర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్.. పరేషాన్

మలక్‌పేట: చిన్న చిన్న గల్లీల్లో దారికి ఇరువైపులా వాహనాలను పార్కిగ్ చేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తెల్తుతున్నాయిన బాటసారులు వాపోతున్నారు. గడ్డిఅన్నారం, దిల్‌సుఖ్‌నగర్ ఆనుకుని ఉండటంతో ప్రైవేట్ హాస్టళ్లు, వ్యాపార సంస్థలు అధికంగా వెలిశాయి. ప్రైవేట్ హాస్టళ్లకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో హాస్టళ్ల ముందున్న రోడ్లపై ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో దారంతా కుంచించుపోయి నడిచేందుకు వీలు లేకుండా పోతుంది. ట్రాఫిక్ పోలీసులు ఈ సమస్యపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షలు



కేటీఆర్ సమక్షంలో రాంబాబుయాదవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న దామోదర్‌రెడ్డి

పహాడీషరీఫ్: బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ జన్మదినం సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ బీఆర్టీయూ అధ్యక్షుడు గౌడెల్లి దామోదర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఆయనకు పూలమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పానుగంటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నాడు చెత్త కొలువు.. నేడు ఆటల నెలవు



ఆహ్లాదం, ఆరోగ్యాన్ని పంచుతున్న క్రీడా ప్రాంగణం

- కొత్త రూపు సంతరించుకున్న అమరుడు సిరిపురం యాదయ్య గ్రౌండ్
- యువత, చిన్నారుల ఆటాపాటలతో నిత్యం సందడి
- అలరిస్తున్న వాల్ పెయింటింగ్స్



క్రీడా ప్రాంగణంలో అలరిస్తున్న బొమ్మలు, కొటేషన్లు, సేద తీరేందుకు సిమెంట్ బల్లలు

బడంగ్‌పేట్: కొంతకాలం క్రితం వరకు గుట్టలుగా చెత్త పేరుకుపోయిన స్థలం.. ప్రస్తుతం ఆహ్లాదం, ఆరోగ్యాన్ని పంచుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో యువత, చిన్నారుల ఆటాపాటలతో సందడిగా కనిపిస్తోంది. వివరాలు.. గతంలో అతిపెద్ద చెత్త డంపిగ్ యార్డుగా ముద్రపడ్డ ఆ స్థలంలోని నాలుగెకరాలను క్రీడామైదానికి కేటాయించారు. రూ.2 కోట్లు వెచ్చించి మైదానంగా తీర్చిదిద్దారు. చక్కని వాకింగ్ ట్రాక్‌ను తయారు చేయడంతో యువత, చిన్నారులు, విశ్రాంత ఉద్యోగులు, మహిళలు, యువతులు ఉదయం, సాయంత్రం వాకింగ్, రన్నింగ్ చేసేందుకు అనుకూలంగా రూపొందించారు.



మైదానంలో వాలీబాల్, క్రికెట్ అడుతున్న యువత

మరోవైపు యువత, చిన్నారులు ఇదే మైదానంలో క్రికెట్, వాలీబాల్ ఆడుతూ, కరాటే, యోగా చేస్తూ శారీరక, మానసిక బలాన్ని పెంపొందించుకుంటున్నారు. తెలంగాణ కోసం ఆత్మ బలిదానం చేసిన మహేశ్వరం నియోజకవర్గం ముద్దుబిడ్డ, అమరుడు సిరిపురం యాదయ్య పేరుతో ఈ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పర్చారు. బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇటీవల వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా క్రీడా ప్రాంగణంలోని గోడలకు వాల్ పెయింటింగ్స్ వేయించారు. దేశ, రాష్ట్ర సమైక్యతను పొందుపరుస్తూ, చక్కని బొమ్మలు, యువతకు అవగాహన కల్పించేలా కొటేషన్లు, ఆర్మీ సేవలను తెలియజెప్పే సందేశాలు, యోగాసనాలు తదితర చిత్రాలను వేయించారు. ఈ వాల్ పెయింటింగ్స్ చూపరులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. చిన్నారులతో వచ్చిన పేరెంట్స్ వీటి వద్ద సెల్ఫీ తీసుకుంటుండటం విశేషం. వాకింగ్ చేస్తున్న వారికి ఒక వైపున చక్కని ఆక్సిజన్ అందించే చెట్లు, సేద తీరేందుకు బల్లలు వేశారు. అమరుడు సిరిపురం యాదయ్య క్రీడా ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దిన కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి వాకర్స్, యువత ధన్యవాదాలు చెబుతున్నారు.

> **శ్రమించి బ్యూటిఫికేషన్ చేశాం**
>
> 
>
> క్రీడా ప్రాంగణం ఉన్నప్పటికి ఏదో వెలితిగా అనిపించింది. ఆలోచన చేసి, మంచి ఆర్టిస్టులను పిలిపించి వాల్ పెయింటింగ్స్ వేయించాం. ప్రస్తుతం క్రీడా ప్రాంగణం ఎంతో ముచ్చటగా ఉంది. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రాంగణాన్ని బ్యూటిఫికేషన్ చేయడం సంతోషంగా ఉంది.
>
> – పి.సరస్వతి, కమిషనర్

సంచార జాతులకు సర్టిఫికెట్లు ఇవ్వాలి

మీర్‌పేట: మండల పరిధిలోని సంచార జాతుల వారికి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ నాయకులు శనివారం బాలాపూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. బతుకుదెరువు, ఇతర చిరు వ్యాపారాల నిమిత్తం సంచార జాతుల వారు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఈ ప్రాంతంలో నివాసముంటున్నారని తెలిపారు. ఇలాంటి వారు మండల పరిధిలో 600 కుటుంబాలకు పైగా ఉన్నారన్నారు. స్థానికంగా ఉండే సంచార జాతులతో కలిపి వీరికి కూడా కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా చొరవ తీసుకోవాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మహిళా కార్యదర్శి యాదమ్మ, సహాయ కార్యదర్శి రెడ్యానాయక్, గిరిజన సమైక్య మండల కార్యదర్శి శత్రునాయక్, రమావత్ పాండునాయక్, ఆర్తి, సోని, కమల, దినేష్, శ్రీకర్, పవన్ ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బోనాల పండుగకు ఏర్పాట్లు చేయండి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరామ కాలనీలో ఈనెల 13న జరిగే ఆషాఢ మాసం బోనాల పండుగ కోసం తగిన ఏర్పాట్లు చేయాలని మాజీ కౌన్సిలర్లు కెంచె లక్ష్మీనారాయణ, పల్లపు శంకర్, ఎనగండ్ల శ్రీధర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పోచమ్మ ఆలయం నుంచి బొడ్రాయి, దుర్గమ్మ ఆలయాల వరకు లైట్లు వేయించాలన్నారు. ఆయా కాలనీల్లో అన్ని చోట్లా వీధి దీపాలకు మర మ్మతులు చేయించాలని కోరారు. పండుగ వేళ రోడ్లపై మురుగు నీరు పారకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రహదారులను శుభ్రంగా ఊడ్పించడంతో పాటు దెబ్బతిన్న రోడ్లపై మొరం పోయించి, భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలని విన్నవించారు. వీరి వెంట మస్న రవికుమార్, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.



కమిషనర్ వెంకట్రామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రత్యేక చట్టం తీసుకురావాలని వినతి

శంకర్‌పల్లి: స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం ఉండేలా ప్రభుత్వం ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని దివ్యాంగుల జాతీయ హక్కుల సంఘం చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు కాసాల యాదయ్య డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 43 లక్షల మంది దివ్యాంగులు ఉండగా.. వారిలో 24.85లక్షల మంది చేయూత పెన్షన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అదేవిధంగా దివ్యాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచనలు చేయాలని కోరారు. తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో దివ్యాంగులకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం ఉండేలా ప్రత్యేక చట్టం తీసుకొచ్చారన్నారు. అదేవిధంగా తెలంగాణలోనూ అదే రకమైన చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల జాతీయ హక్కుల సంఘం మండల అధ్యక్షుడు బిర్ల పెద్దకుమార్, నాయకులు ఎస్.కుమార్, దత్తు, శ్రీనివాస్, శీతల్‌సింగ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

ఆధునిక తపాలా పరిజ్ఞానంతో సేవలు వేగవంతం

డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ హైమావతి

కందుకూరు: ఆధునిక తపాలా పరిజ్ఞానం ద్వారా వేగవంతమైన సేవలు వినియోగదారులకు అందించేలా నూతన పోస్టల్ టెక్నాలజీ ఐటీ 2.0 పేరుతో ప్రవేశపెడుతున్నట్లు తపాలా శాఖ హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ హైమావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో వినియోగదారులకు వేగంతో పాటు సమర్థవంతమైన సేవలు అందుతాయన్నారు. అందుకుగాను ఆ టెక్నాలజీని అమలు చేయడంలో ఈ నెల 7న డివిజన్ పరిధిలోని అన్ని పోస్టు ఆఫీసుల్లో ఎలాంటి లావాదేవీలు జరగవన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

ఘనంగా ఇన్వెస్టిచర్ వేడుక

హుడాకాంప్లెక్స్: విద్యార్థి దశలోనే వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న జ్ఞానం, శక్తి సామర్థ్యాలను వెలికి తీయడమే తమ లక్ష్యమని త్రివేణి విద్యాసంస్థల చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్ శ్రీ త్రివేణి పాఠశాలలో శనివారం ఇన్వెస్టిచర్ (హోదా అధికార మహోత్సవ వేడుక)ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రమాణ స్వీకారం, నూతన విద్యార్థి మండలి సభ్యుల ప్రమాణస్వీకారం ఘనంగా జరిగింది. స్కూల్ హెడ్‌బాయ్‌గా విఘ్నేష్, హెడ్ గర్ల్ జ్యోతి సోలంకి, స్పోర్ట్స్ కెప్టెన్ జయంతి, 8 మంది వైస్ కెప్టెన్లకు బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించారు. నూతనంగా డిసిప్లేన్, కమ్యూనికేషన్, కోఫ్రెండ్లీ, స్వచ్ఛ భారత్ క్లబ్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. హోలిస్టిక్ విద్యతో పాటు ఉన్నత ప్రమాణాలతో కూడిన నాయకత్వను పటిమను అలవర్చడమే శ్రీ త్రివేణి విద్యాసంస్థల లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్ అందరినీ అలరించింది. కార్యక్రమంలో కరెస్పాండెంట్ సునీల్, ప్రిన్సిపాల్ యోగేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇన్వెస్టిచర్ వేడుకలో పాల్గొన్న విద్యార్థులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న దత్తునాయక్

మహేశ్వరం: జూలై 9న జరిగే అఖిల భారత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి.దత్తునాయక్, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నడికూడ శివ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి హక్కులను కాలరాస్తోందన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జూలై 9న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ మండల కార్యదర్శి శివయాదవ్, సీపీఐ మండల కార్యదర్శి దేవేందర్, కాంగ్రెస్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు షురూ



నాదర్‌గుల్‌లో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగిస్తున్న సిబ్బంది

- అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు
- త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సబితారెడ్డి ఆదేశం

బడంగ్‌పేట్: గాంధీనగర్ నుంచి నాదర్‌గుల్ రోడ్డు విస్తరణలో భాగంగా అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు పనులను ఆ శాఖ అధికారులు, సిబ్బంది శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో గాంధీనగర్ నుంచి నాదర్‌గుల్ వరకు, నాదర్‌గుల్ నుంచి కుర్మల్‌గూడ వరకు రోడ్ల విస్తరణ కోసం నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఈ పనులు చేపట్టేందుకు రహదారులకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలతో పాటు అడ్డుగా ఉన్న చెట్ల కారణంగా పనులు సాగలేదని తెలిపారు. మూడు రోజుల క్రితం బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించి తక్షణమే రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. ఇందులో భాగంగా ముందు విద్యుత్ లైన్లను తొలగిస్తున్నారని స్పష్టంచేశారు. పనులు ప్రారంభించి, వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్న ఎమ్మెల్యే సబితారెడ్డికి బీఆర్‌ఎస్ నాయకులు, స్థానికులు కృతజ్ఞతలు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అంకంగారి కుమార్‌గౌడ్, బీసీ సెల్ ప్రెసిడెంట్ కోటగిరి జంగయ్య, బీఆర్‌ఎస్ 27వ డివిజన్ అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్‌యాదవ్, తెలంగాణ ఉద్యమకారుడు రామోజి నరేష్‌చారి, అంకంగారి శశిపాల్‌గౌడ్, కొమరయ్య యాదవ్, నెమలి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

హస్తినాపురం: ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ తోట మహేశ్ అన్నారు. శుక్రవారం రాత్రి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీవీకాలనీ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేసి హెల్మెట్ లేకుండా వాహనాలు పడిపిన వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడపరాదని తప్పనిసరి లైసెన్స్ తీసుకోవాలన్నారు. సైబర్‌నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుర్తుతెలియని వ్యక్తులు వాట్సాప్ గ్రూపులలో లింకులు పంపించి వాటిని ఓపెన్ చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు గిరిష్‌కుమార్, నాగరాజు, అనిల్‌కుమార్‌రెడ్డి, రవినాయక్, పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేయాలి

లింగోజిగూడ: లింగోజిగూడ డివిజన్ పరిధిలోని హరిజన బస్తీలోని డ్రైనేజీ మ్యాన్‌హోల్ ధ్వంసమైన ప్రమాదకరంగా మారింది. లింగోజిగూడ ఓల్డ్ విలేజ్ నుంచి అవేర్ గ్లోబల్ ఆసుపత్రికి వెళ్లె ప్రధాన రోడ్డులోని మ్యాన్‌హోల్ పైకప్పు భూమిలోకి కుంగిపోయింది. ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం సుమారు రూ.22కోట్లతో వివిధ కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. త్వరలో వంద కోట్లతో పట్టణంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. గత పాలకులు పట్టణాల అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని, మాస్టర్ ప్లాన్ రూపొందించలేదని విమర్శించారు. ఫలితంగా చాలా కాలనీల్లో అభివృద్ధి పనులు కనిపించడం లేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిలో ప్రజలందరూ పార్టీలకతీతంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తద్వారా పట్టణాలు అన్ని రంగాల్లో త్వరితగతిన అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమాల్లో కమిషనర్ సునీత, నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, విశ్వం, కొంకళ్ల చెన్నయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, బసిరెడ్డి నరేందర్‌రెడ్డి, శ్రావణి, జమృద్‌ఖాన్, అప్పి, ఇబ్రహీం, ఖాదీర్ తదితరులు పాల్గొన్నారు.



న్యూసిటీ కాలనీలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్